
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## ౧౬ వ భాగం

# నిజ భగవత్స్వరూపం

నారదుడు బ్రహ్మని అడిగాడు నీకో ప్రభువు ఉన్నాడా, ఉంటే ఆయన స్వరూపం ఎటువంటిదీ అని. దానికి బ్రహ్మ సమాధానం చెప్తూ, తనకి ఏమీ తెలియనపుడు తపస్సు ప్రారంభించి మానస యజ్ఞం చేసాడనీ అది కూడా ఫలితం భగవంతుడికే ఇవ్వడానికి చేసాడనీ క్రితం నెల వ్యాసంలో చదివాం. భగవద్గీతలో కృష్ణుడంటాడు, "యద్యదాచరతి శ్రేష్ఠః, తత్తదేవేతరోజనః.." (కర్మ యో. 21) అని. దీనర్ధం ఏమిటంటే శ్రేష్టులైనవారు ఏమార్గం అనుసరిస్తారో, లోకంలో మిగతా జనం వారినే అనుసరిస్తారని. అందువల్లే బ్రహ్మ చేసినటువంటి యజ్ఞాన్నే మిగతావాళ్ళందరూ చేసారు. అదికూడా ఎలాచేసారంటే, భగవంతుడికోసం, ఫలితం భగవంతుడికే అర్పించడానికి. దీనికి సరైనది కూడా భగవద్గీతలో కృష్ణుడు చెప్పడం కనిపిస్తుంది "బ్రహ్మార్పణం, బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం, బ్రహ్మైవ తేన గంతవ్యం, బ్రహ్మ కర్మ సమాధినా" (జ్ఞాన యో. 24). బ్రహ్మం అంటే భగవంతుడు కనక అన్నీ బ్రహ్మంగా భావిస్తూ చేసిన యజ్ఞం, దాని ఫలం కూడా బ్రహ్మమే. అటువంటి బ్రహ్మం వల్ల వచ్చే ఫలితం కూడా భగవంతుడిదే. అయితే అంతా నిరాకారుడైన, త్రిగుణాతీతమైన బ్రహ్మమే అయినప్పుడు ఈ త్రిగుణాలతో ఉండే సగుణం ఎలా వస్తోంది భగవంతుడికి?

క. అగుణుండగు పరమేశుఁడు
జగములఁ గల్పించుకొఱకుఁ జతురత మాయా
సగుణుం డగుఁ గావున హరి
భగవంతుం డనఁగఁ బరఁగె భవ్యచరిత్రా! [2-99]

నిరాకారుడైన భగవంతుడు నిర్గుణుడైనా మాయచేత, దాని ప్రభావంతో జగత్తులని సృష్టించడానికి సగుణుడౌతున్నాడు. అందువల్లే ఆయన భగవంతుడు అని చెప్పబడుతున్నాడు. దీన్నే రామకృష్ణులు అంటారు.

“భగవంతుడికి రూపం ఉందా అంటే ఉంది, లేదా అంటే లేదు.” అందువల్ల విగ్రహారాధన చేసేవాళ్లని చూసి ఎప్పుడూ వెక్కిరించకూడదు. ఒక రూపుతో విగ్రహారాధన ప్రారంభించడం మొదటి మెట్టు. ఉత్తరోత్తరా అదే నిరాకారుడైన భగవంతుడికి దారి చూపిస్తుంది. ఆ నిరాకారుడైన వాణ్ణి చూసాక విగ్రహారాధన బయటపారేయం కదా?

క. విశ్వాత్ముఁడు, విశ్వేశుఁడు,
విశ్వమయుం, డఖిలనేత, విష్ణుఁ, డజుం, డీ
విశ్వములోఁ దా నుండును
విశ్వము దనలోనఁ జాల వెలుఁగుచు నుండన్. [2-100]

విశ్వమే భగవంతుడు అని చెప్పాడు కదా (విశ్వాత్ముడు), అటువంటివాడు విశ్వానికి ప్రభువు, విశ్వం అంతా వ్యాపించి ఉన్నవాడు, అన్నింటినీ నడిపించేవాడు, పుట్టుకే లేనివాడు (అజుండు), ఈ విశ్వంలో ఉంటూ, ఆ విశ్వాన్ని తన లోనే దాచుకున్నవాడై ప్రకాశిస్తూ ఉంటాడు.

చ. అతని నియుక్తిఁ జెంది సచరాచర భూతసమేతసృష్టి నే
వితతముగా సృజింతుఁ బ్రభవిష్ణుఁడు విష్ణుఁడు ప్రోచుఁ బార్వతీ
పతి లయమొందఁ జేయు; హరి పంకరుహోదరుఁ డాదిమూర్తి య
చ్యుతుఁడు త్రిశక్తియుక్తుఁ డగుచుండును నింతకుఁ దానమూలమై [2-101]

ఆ భగవంతుడి అనుమతి ప్రకారం ఈ చరాచర భూతసృష్టిని నేను నిర్మించగలుగుతున్నాను. విష్ణువు దీన్ని పోషిస్తున్నాడు, పార్వతీపతి లయం చేస్తూ ఉంటాడు. దీకంతటికీ మూడు శక్తులకీ మూలహేతువైనవాడే ఆ భగవంతుడు.

క. హరి భగవంతుఁ డనంతుఁడు
కరుణాంబుధి సృష్టికార్యకారణహేతు
స్ఫురణుం డవ్విభుకంటెం
బరుఁ డెవ్వఁడు లేదు తండ్రి! పరికింపంగన్. [2-103]

అందువల్ల భగవంతుడు అనంతుడు. దయాసముద్రుడు (కరుణాంబుధి), సృష్టికి మూలకారణమైనవాడు. ఆలోచించి చూస్తే ఆ విభుడికంటే శ్రేష్ఠమైనవాడు కానీ, శ్రేష్ఠమైన పదార్థం కానీ ఏదీ లేదు. అయితే నాకే ప్రభువు ఇంకొకడు ఉన్నాడా అని అడిగావు కదా, దానికి సమాధానం విను.

ఉ. ఆ నళినాక్షు నందనుఁడ నయ్యుఁ, బ్రజాపతి నయ్యు, యోగ వి
ద్యా నిపుణుండ నయ్యునుఁ, బదంపడి మజ్జననప్రకారమే
యేను నెఱుంగ, నవ్విభుని యిద్ధమహత్త్వ మెఱుంగ నేర్తునే?
కానఁబడున్ రమేశపరికల్పితవిశ్వము గొంతకొంతయున్. [2-105]

నేను ఆయన నాభిలోంచి పుట్టిన పద్మంలో పుట్టినవాడినే, ప్రజలని పుట్టించే ప్రజాపతినే, యోగవిద్యానిపుణిడినే అయినా నా జననం ఎలా జరిగింది అనేదే తెలుసుకోలేకపోతున్నాను. అందువల్ల ఆ భగవంతుడి మహత్తు ఇటువంటిది అని చెప్పలేను గానీ, ఆయన కల్పించిన ఈ విశ్వం నాకు కొంతలో కొంత మాత్రం తెలుసు.

బ్రహ్మ చెప్పిన ఈవిషయం చూస్తే రామకృష్ణుల శిష్యులైన మహేంద్రనాథ్ గుప్తాగారి సమాధానం గుర్తుకు రాక మానదు. "రామకృష్ణుల గురించి మీకు తెల్సినది చెప్పండి" అంటే ఆయన ఏమంటారంటే, "ఆయనో మహాసముద్రం వంటివారు, నాకున్న చిన్న కడవలో (నా బుద్ధి, శరీరం సహకరించినంతలో) ఆయన దగ్గిరకి వెళ్ళి దానిలో నేను మోయగలగినన్ని/పట్టినన్ని నీళ్ళు తెచ్చుకున్నాను. అంతకంటే ఇంకేం చెప్పగలను?"

మ. విను వేయేటికిఁ; దాపసప్రవర! యివ్విశ్వాత్ముఁ డీశుండు దాఁ
దన మాయామహిమాంతముం దెలియఁగాఁ దథ్యంబుగాఁ జాలడ
న్నను, నే నైనను మీరలైన సురలైనన్ వామదేవుండు నై
నను నిక్కం బెఱుఁగంగఁ జాలుదుమె జ్ఞానప్రక్రియాయుక్తులన్. [2-106]

ఈ భగవద్విభూతి ఎటువంటిదంటే, విశ్వాత్ముడైన భగవంతుడు తనచేత కల్పింపబడిన మాయావైభవాన్ని తానే మొదలూ చివరా తెలుసుకోలేడు. ఇంక నేనూ, నువ్వూ, ఇంద్రాది దేవతలూ, శివుడూ మొదలైనవారు జ్ఞానంతోటి గానీ ఉపాయంతో గానీ తెలుసుకోగలమా? ఈ విషయం కొంచెం వివాదాస్పదంగా ఉండవచ్చు కానీ కొంత ఆలోచిస్తే

తెలుస్తుంది. "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" అంటోంది ముండకోపనిషత్తు. బ్రహ్మాన్ని తెలుసుకున్నవాడు బ్రహ్మమే అవుతాడుట. అదెలా అంటే మరోసారి రామకృష్ణులు చెప్పినదే. భగవంతుణ్ణి తెలుసుకోవడం అంటే ఉప్పు బొమ్మ సముద్రం లోతు కొలవడం వంటిది అంటారాయన. ఏమౌతుంది ఉప్పుబొమ్మ సముద్రం లోతు కొలవడానికి సముద్రంలోకి వెళ్తే? అందులో లీనమవ్వడమే కానీ ఆ సముద్రం ఎంత లోతు అనేవేవీ తెలియడానికి ఆస్కారం లేదు. అలాగే ఆత్మజ్ఞానం అనేది కలిగితే ఏమౌతుంది? ఆ విశ్వాత్మలో విలీనం జరిగి ఇంకేమీ ఉండదు తెలుసుకోవడానికి. ఆ భగవంతుడెలాటివాడంటే,

క. గగనము దన కడపలఁ దాఁ
దగ నెఱుగని కరణి విభుఁడు దా నెఱుఁగఁ డనన్
గగనప్రసవము లే దన
నగునే సర్వజ్ఞతకును హాని దలంపన్. [2-108]

ఆకాశానికి తన సరిహద్దులు ఇవీ ఇంతా అని తెలియవు అయినా ఆకాశం సర్వ వ్యాపి కాదు అనలేము కదా, అలాగే తన సమగ్రతని తెలుసుకోలేనంత మాత్రాన భగవంతుడు సర్వవ్యాపి, సర్వజ్ఞుడూ కాదని అనగలమా? అందువల్లే భగవంతుడు సర్వవ్యాపి, సర్వజ్ఞుడూ అయినా సరే తన పరిధులు తనకే తెలియవు అనడం లో ఏమీ తప్పు, అసందర్భం అనేది లేదు.

చ. తలకొని యమ్మహాత్మకుఁడు దాల్చిన యయ్యవతారకర్మముల్
వెలయఁగ నస్మదాదులము వేయి విధంబుల సన్నుతింతు; మ
య్యలఘు ననంతునిం జిదచిదాత్మకు నాద్యు ననీశు నీశ్వరుం
దెలియఁగ నేర్తుమే తవిలి; దివ్యచరిత్రున కేను మ్రొక్కెదన్. [2-109]

ఇప్పుడు ఆయన అవతారాలు చెప్పబోయే ముందు ఆ భగవంతుణ్ణి తల్చుకుని నమస్కారం చేస్తూ చెప్తున్నాడు. భగవంతుడు ఆయా అవతారాలలో చేసిన పనులని తల్చుకుని ఆయనని కీర్తిస్తూ ఉంటాం. అటువంటి అనంతుణ్ణి, చిత్ శక్తి స్వరూపుణ్ణి, ఆద్యుడిని (మొదటివాడు) అన్నింటికీ తానే ప్రభువైనవాడిని, ఈశ్వరుణ్ణి, మనం ఎంత ప్రయత్నించినా ఎలా తెలుసుకోగలం? లోకాలన్నీ ఎలా పుట్టాయనేది చెప్తున్నాడిప్పుడు.

వ. అని వెండియు నిట్లను "ననఘా! యమ్మహనీయతేజోనిధి మొదలి యవతారంబు సహస్ర శీర్షాది యుక్తంబయి ప్రకృతి ప్రవర్తకం బగు నాదిపురుష రూపంబగు; నందుఁ గాలస్వభావంబు లను శక్తు లుదయించె; నందుఁ గార్యకారణరూపం బయిన ప్రకృతి జనించెఁ; బ్రకృతివలన మహత్తత్త్వంబును దానివలన నహంకారత్రయంబునుఁ బుట్టె నందు రాజసాహంకారంబువలన నింద్రియంబులును, సాత్వికాహంకారంబువలన నింద్రియగుణ ప్రధానంబు లైన యధిదేవతలునుఁ, దామసాహంకారంబువలన భూతకారణంబు లయిన శబ్ద స్పర్శ రూప రస గంధ తన్మాత్రంబులునుం బొడమెఁ; బంచతన్మాత్రంబులవలన గగనానిల వహ్ని సలిల ధరాదికంబైన భూతపంచకంబు గలిగె; నందు జ్ఞానేంద్రియంబు లయిన త్వక్చక్షు శ్రోత్ర జిహ్వాఘ్రాణంబులునుఁ గర్మేంద్రియంబులైన వాక్పాణి పాదపాయూపస్థంబులును మనంబును జనియించె; నన్నింటి సంఘాతంబున విశ్వరూపుండైన విరాట్పురుషుండు పుట్టె; నతని వలన స్వయంప్రకాశుండయిన స్వరాట్టు సంభవించె; నందుఁ జరాచర రూపంబుల స్థావరజంగమాత్మకంబయిన జగత్తు; గలిగె నందు సత్వరజస్తమోగుణాత్మకుల మయిన విష్ణుండును హిరణ్యగర్భుఁడ నయిన యేనును రుద్రుండునుఁ గలిగితి; మందు సృష్టిజననకారణుం డయిన చతుర్ముఖుండు పుట్టె; వాని వలన దక్షాదులగు ప్రజాపతులు దొమ్మండ్రు గలిగిరి; అందు భవత్ప్రముఖులైన సనకసనందనాది యోగీంద్రులును, నాకలోక నివాసు లయిన వాసవాదులును, ఖగలోకపాలకులగు గరుడాదులును, నృలోకపాలకులగు మను మాంధాతృ ప్రముఖులును, రసాతలలోకపాలకు లగు ననంత వాసుకి ప్రభృతులును, గంధర్వ సిద్ధ విద్యాధర చారణ సాధ్య రక్షోయక్షోరగ నాగలోకపాలురును మఱియు ఋషులునుఁ, బితృదేవతలును, దైత్య దానవ భూత ప్రేత పిశాచ కూష్మాండ పశు మృగాదులును, నుద్భవించిరి; ఇట్టి జగత్ప్రథమోద్భవంబు మహత్తత్త్వసృష్టి యనంబడు; ద్వితీయం బండసంస్థితం బనం దగుఁ; దృతీయంబు సర్వభూతస్థం బన నొప్పు; నందైశ్వర్య తేజో బల సంపన్నులైన పురుషులు సర్వాత్ముండైన నారాయణుని యంశసంభవులుగా నెఱుంగు; మప్పుండరీకాక్షుని లీలావతారంబు లనంతంబులు; దత్కర్మంబులు లెక్కపెట్ట నెవ్వరికిని నలవిగా; దయినను నాకుం దోఁచి నంత నీ కెఱింగించెద; వినుము. [2-112]

భగవంతుడు అనంతుడు కదా? ఆదిపురుషుడి రూపమే ఆ బ్రహ్మనికి మొదటి అవతారం. అందులోనుండి కాలం, స్వభావం అనే రెండు శక్తులు పుట్టాయి. వాటిలోంచి కార్యాకార్య రూపమైన ప్రకృతి పుట్టింది. అందులోంచి మహతత్త్వం, దానిలోంచి త్రిమూర్తితత్వాలైన సాత్విక, రాజసిక, తామసమైన అహంకారాలు పుట్టాయి. రాజసిక అహంకారం ఇంద్రియాలకి హేతువు. సాత్వికాహంకారంలోంచి ఇంద్రాది దేవతలు, తామసికాహంకారంలోంచి శబ్ద, స్పర్శ, రస, రూప, గంధాలనే పంచ తన్మాత్రలు ఉద్భవించాయి. ఈ తన్మాత్రలనుంచే పంచభూతాలనేవి (ఆకాశం, భూమి, జలం, వాయువు,

అగ్ని) పుట్టుకొచ్చాయి. వాటిలోంచే త్వక్కు, చక్షువు, శ్రోత్రం, జిహ్వా, ఘ్రాణం అనే జ్ఞానేంద్రియాలూ, మనస్సు పుట్టాయి. వీటి చేరికతో విరాట్పురుషుడు ఉదయించాడు – ఇదే ప్రజోత్పత్తికి మూలం. ఆయన్నుంచి స్థావరజంగమాత్మకమైన జగత్తు పుట్టింది. అందులోంచి సత్వగుణ స్వరూపుడైన విష్ణువు, రజోగుణ సంపన్నుడైన బ్రహ్మ (నేను), తమోగుణ సంపన్నుడైన రుద్రుడూ ప్రభవించాం. అలా దక్ష ప్రజాపతీ, ఆయన సంతతీ (ఈ విషయాలు ముందు వ్యాసాల్లో చూసాం) లోకాలని పాలించే మనువూ, ఋషులూ, సురాసుర గణం, భూత, ప్రేత, పిశాచాలు మొదలైనవన్నీ ఉద్భవించాయి. ఇలా మొదటగా జరిగినది మహత్తత్వ సృష్టి. ఇదంతా భగవంతుడి సృష్టే. ఇంతటి సృష్టి చేయగల భగవంతుడు చేసే మంచి పనులని లెక్కించడం ఎవరికీ సాధ్యం కాదు.

ఈ విషయం మరో సారి భగవద్గీతలో చెప్పిన భగవత్విభూతితో పోల్చి చూసుకోవచ్చు. అందులో ఒక్క శ్లోకం మాత్రం చాలు అలా పోల్చడానిక్కూడా.

యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున
న తదస్తి వినా యత్స్యాన్మయా భూతం చరాచరమ్ [భ. గీ 10–39]

సర్వ భూతాలలో ఉండే మూలకారణమైన చైతన్యం ఏదైతే ఉందో అది నేనే. స్థావర జంగమాత్మకమైన ఈ సృష్టిలో నేను, నా శక్తి లేకుండా నిలబడగలిగేది ఏ ఒక్కటీ లేదు. దీనినే అనేకసార్లు మనం చెప్పుకున్నట్టూ మంత్ర పుష్పంలోంచి చెప్పుకోవచ్చు. “యచ్చ కించిజ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతే ఽపివా అన్తర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః” ఈ సర్వ జగత్తులో కనిపించే, వినిపించేవి (*దృశ్యతే శ్రూయతే పివా*) ఏవైతే ఉన్నాయో, లోపల బయట (*అన్తర్బహిశ్చ తత్సర్వం) వ్యాపించి* ఉన్నది భగవంతుడు తప్ప మరొకటి కాదు.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS